# మధురమైన అనుభవం

**-శివల పద్మ**

విశాలమైన డబుల్‌కాట్ మీద పడుకుని చదువుకుంటున్న పృధ్వీ టెలిఫోన్ రింగవడంతో కొద్దిగా ఒత్తిగిల్లి ఫోన్ అందుకున్నాడు.

''హలో''

''హేయ్! నేనురా హరీష్‌ని''

పడుకున్నవాడల్లా ఒక్క ఉదుటున లేచి కూర్చున్నాడు పృధ్వీ.

''చెప్పరా. ఏమైంది? అంతా ఫైనలైజ్ అయిందా?''

''ఓరీ నీ ఆత్రం బంగారంగానూ. అవునులే మొదటిసారి కదూ యమా ఎక్సయిటింగ్‌గా వుంటుంది''

''ఒరే ఇడియట్. నిన్ను సిట్యుయేషన్ ఎనలైజ్ చేయమనలేదు. ముందు డిటైల్స్ ఇవ్వు''

''ఒకే...ఒకే... పేరు శార్వాణి, వయసు పందొమ్మిది, ఎత్తు అయిదు ఆరు, కొలతలు...''

''అక్కర్లేదు. అవి నేను చూసుకుంటాను''

''ఓర్నీ.. ఏది ఏమైనా నువ్వు భలే లక్కీ ఫెలోవిరా. మొదటిసారే నీకు జెమ్ దొరికింది. టౌన్‌లో ఏం టాకుందో తెలుసా ఆ పిల్లకి. కొమ్ములు తిరిగిన మగాడిని సైతం చమటలు పట్టించుతుందట. ఏంటా హొయలు, ఏమిటా బిగువులు, ఏమా స్పీడూ... ఆహా.. అనుభవుజ్ఞులంతా ఈ జీవితానికిది చాలు అనుకుంటారట. చిన్నవాళ్లంతా అమర సుఖాలంటే గ్యారంటీగా ఇదే అనుకుంటారట.''

వింటున్న పృధ్వీకి నరాలు జివ్వుమన్నాయి. ఉవ్విళ్లూరుతున్న మనస్సుని అదుపు చేసుకుంటూ ''వెన్యూ ఎక్కడ?'' అనడిగాడు.

''హోటల్ దేవి, రూమ్ నెంబర్ సిక్స్‌టీ నైన్''

''థాంక్స్''

''ఒట్టి థాంక్స్ కాదురా బయటకి వచ్చాక నీ అనుభవం అక్షరం అక్షరం చెప్పాలి''

''చాల్లేరా ఇంక ఆపేయ్... ఫోన్ పెట్టేస్తున్నాను''

''ఏమిటి తయారవడానికేనా? ఒకే ఒకే ఆల్ ది బెస్ట్'' నవ్వుకుంటూ ఫోన్ పెట్టేసాడు పృధ్వీ.

అతడి మనస్సంతా ఒకరకమైన ఉద్వేగంతో నిండిపోయింది. లైఫ్‌లో మొదటిసారిగా ఒక అందమైన అడ్వెంచెర్ చేయబోతున్నాడు. ఓ అందమైన యువతిని ఎంజాయ్ చేయబోతున్నాడు. మగవాడికి లైఫ్‌లో ఇంతకన్నా అందమైన ఎక్స్‌పీరియన్స్ ఏముంటుంది?

భార్య లావణ్య చక్కనిదే కాక సుగుణాలరాశి కూడా. పైగా లవ్‌మ్యారేజీ!

అయినా గయ్యాళి భార్యలు, అనాకారులైన భార్యలు వున్న వాళ్లు మాత్రమే బయట అందాలకోసం వెళ్తారని ఏముంది?

జస్ట్‌ఫరె ఛేంజ్. జస్ట్ ఫర్ ఎంజాయ్‌మెంట్. ఎవ్వరైనా వెళ్తారు. పైగా లావణ్య ఊళ్లోలేదు. ఫ్రెండ్సంతా తెగ గొడవ చేస్తున్నారు. బొత్తిగా ఇంత దద్దోజనంగాడివేంట్రా, పెళ్లానికే అంకితమైపోతే ఎలా అంటూ.

తను వెళ్లలేక, వెళ్లాలనిలేక కాదు, కానీ అనవసరంగా లావణ్యని ఎందుకు బాధపెట్టడం అని ఆగిపోయాడు. ఖర్మకాలి బయట పడిందంటే లావణ్య చాలా హర్ట్ అవుతుంది. కానీ వీళ్లంతా ధైర్యం నూరిపోశారు. తెలిసే అవకాశమే లేదన్నారు. అదీ నిజమే. వీళ్లు చెప్తే తప్ప లావణ్యకి తెలిసే అవకాశమేలేదు.

వీళ్లా? పొరపాటున కూడా నోరు జారరు. ఎందుకంటే ఎవరి సీక్రెట్స్ వాళ్లకున్నాయి. నో ప్రాబ్లెమ్ ఎటాల్!

పృధ్వీ హుషారుగా లేచి బాత్రూమ్‌లోకి వెళ్లాడు. షాంపూతో తలస్నానం చేసాడు. జీన్‌పాంట్, బ్లాక్ టీషర్టు తీసుకున్నాడు. అందంగా తయారై అద్దంలో చూసుకున్నాడు.

పలుచని గులాబీరంగు పెదవి మీద చక్కని మీసకట్టు. విశాలమైన కళ్లు, కోలముక్కు పృధ్వీ అందగాడే అని చెప్తాయి. చక్కని పొడవు, విశాలమైన వక్షం, మంచి శరీర ఛాయ చూడగానే అతడి మగసిరికి హాట్సాఫ్ అంటారు అమ్మాయిలు.

నీట్‌గా తయారై సోఫాలో కూర్చుని వాక్‌మెన్ చెవులకి తగిలించుకున్నాడు.

చెవులు సంగీతాన్ని వింటూంటే మనస్సు రాబోతున్న మధుర రాత్రిని తలచుకుంటూ పులకించిపోతున్నది. ఆ రాత్రి అంతటినీ మధురాతిమధురంగా మలుచుకునేందుకు ఏమేం చేస్తే బావుంటుందో ఊహల్లోకి వెళ్లిపోయాడు అతడు.

సరిగ్గా అరగంట తరువాత కాలింగ్‌బెల్ మ్రోగిన శబ్దం వినిపించింది. వాక్‌మెన్ తీసి టీపాయ్ మీద పెట్టి వెళ్లి తలుపు తీశాడు. విస్మయంతో అతడి కళ్లు వెడల్పయ్యాయి. ఎదురుగా నిలచిన తల్లినిచూసి-

''మమ్మీ! నువ్వు ఇప్పుడు... ఏమిటంత హఠాత్తుగా?''

చిన్నగా నవ్వుతూ లోపలికి అడుగేసింది వైష్ణవి.

''నా ఫ్రెండ్ కూతురికి రేపు మ్యారేజ్ ఉందిరా ఇక్కడ. ముందు మారేజ్‌కి అటెండ్ కాలేనేమో అనుకున్నాను. కానీ సడెన్‌గా నాక్కూడా ఒక పని పడింది. ఇక్కడ ఒక అమ్మాయిని పర్సనల్‌గా నేనే ఇంటర్‌వ్యూ తీసుకుందామని అనుకున్నాను. బయలుదేరి వచ్చాను.''

వైష్ణవి ఒక పాపులర్ ఇంగ్లీష్ మాగజైన్‌కి ఎడిటర్. ఎప్పుడూ బిజీగా వుంటుంది. కొత్త కొత్త విషయాలు, న్యూస్‌లు సంపాదించి పత్రికలో వేసుకుంటూ వుంటుంది. తన స్వంత పత్రిక అవడంతో ఒక్కోసారి తను కూడా ఇంటర్వ్యూ కోసం రకరకాల ఊళ్లు తిరుగుతూ వుంటుంది.

హఠాత్తుగా తల్లిని చూసినందుకు ఆనందం కలిగినా ఆశాభంగం మాత్రం తప్పలేదు పృధ్వీకి. ఒక్కసారిగా నీరసం ఆవహించింది.

రాకరాక ఒక్క అవకాశం వచ్చి తనేదో అడ్వెంచర్ చేయబోతుంటే ఈ రోజే రావాలి తల్లి?

ఛ... అంతా పాడయ్యింది ఖర్మ... మనస్సులో విసుక్కుంటూ హరీష్‌కి ఫోన్ చేశాడు.

''హేయ్ హరీష్! సారీ యార్. ఇవ్వాల్టి ప్రోగ్రాం కాన్సిల్ చేయాల్సి వుంటుంది'' చెప్పలేక చెప్పాడు.

''ఏమైందిరా? అంతా రెడీ అయ్యాక ఇప్పుడేమైంది?'' తల్లి తనవైపే చూస్తూ వుండడంతో ఓ వెధవ నవ్వు నవ్వాడు పృధ్వీ.

''అబ్బే ఏమీలేదు. ఇప్పుడే అమ్మ వచ్చింది. అదే. అనుకోకుండా వచ్చిందిట. పార్టీని కొద్దిగా కన్విన్స్ చేయి. ఈ డీల్ మరోసారి మాట్లాడుకుందాం'' సీరియస్‌గా ముఖం పెట్టి చెప్పాడు.

అవతల వైష్ణవికి తెలియదు చిన్నప్పుడు తను మాటలు నేర్పించిన కొడుకు ఈనాడు పెద్దవాడై ఆ తెలివితేటలు తన ముందే వాడుతున్నాడని.

యధాలాపంగా ఈ సంభాషణ వింటోందామె.

''ఎవర్రా అది? ఏమిటా డీల్?'' అనడిగింది కొడుకు ఫోన్ పెట్టేశాక.

''ఏం లేదమ్మా. ఓ చిన్న బిజినెస్ డీల్. ఈరాత్రికి మాట్లాడుకుందాం. రమ్మంటే ఇప్పుడు కాదని చెప్పాను'' లోలోపల గిల్టీ ఫీలయ్యాడు పృధ్వీ.

''అర్జంటయితే వెళ్లాల్సింది కదరా''

''అబ్బ... ఏం ఫర్వాలేదమ్మా! దాని మాటకేంగానీ వంట చేయగలవా? లేక హోటల్ నుంచి తెచ్చేసుకుందామా?''

''బయట నుంచి ఎందుకురా. స్నానంచేసి ఓ

గంటలో చేసేస్తాను'' అనేసి లోపలికి వెళ్లిపోయింది.

తల్లితో ఏదో మాట్లాడుతున్నాడేగానీ పృధ్వీ మన సంతా తప్పిపోయిన ఆ మధురానుభవం మీదే వుంది''

అన్యమనస్కంగా వున్న కొడుకుని చూసి ''ఏరా! ఇందాక వెళ్లాల్సిన పార్టీ గురించేనా ఆలో చిస్తున్నావు?'' అని తల్లి అడిగేసరికి గతుక్కుమ న్నాడు.

భోజనాలయ్యాక ఓ పావుగంట తల్లితో మాట్లాడి తన బెడ్‌రూమ్‌లోకి వచ్చేశాడు. పక్క మీద పడుకున్నాడేగానీ నిద్ర పట్టలేదు. అశాంతిగా అటూ ఇటూ పొర్లి లేచి బయటకి వచ్చాడు.

అప్పటికి టైమ్ పన్నెండయింది. చల్లని చిరుగాలి హాయిగా వీస్తోంది.

రెండు బెడ్‌రూమ్‌లకీ కామన్‌గా ఒక పెద్ద బాల్కనీ కమ్ సిటవుట్ ఉంది. వైష్ణవి తాను దగ్గరుండి ఆ బాల్కనీ అలా వచ్చేలా కట్టించింది. విశాలమైన ఆ బాల్క నీలో కాయిర్ కార్పెట్ పరిపించి ఒక ప్రక్కగా కేన్ ఉయ్యాల పెట్టించింది.

తర్వాత లావణ్యవచ్చి చిన్నచిన్న తొట్టెలలో మల్లె, గులాబీ మొక్కలు వేసి మూడువైపులా పేర్చి ఆ బాల్కనీకి మరింత అందాన్ని పెంచింది.

ఎన్నో వెన్నెల రాత్రులు లావణ్య వొడిలో తల పెట్టుకుని ఆ ఉయ్యాల్లో పడుకుంటే ప్రేమగా తన జుట్టు సవ రిస్తూ బోలెడు కబుర్లు చెబుతూ వుండేది లావణ్య.

పరధ్యానంగా ఉయ్యాల దగ్గరకి వచ్చాక పృధ్వీ అక్కడ తల్లిని చూసి విస్మయం చెందాడు.

''అమ్మా! ఇక్కడ కూర్చు న్నావేమిటి? నిద్ర పోలేదూ?''

''ఎందుకో నిద్ర రాలేదురా. ఈ వెన్నెల్లో, చల్లగా లిలో ఇక్కడ కూర్చుంటే చాలా హాయిగా ఉంది''

తలంటు పోసుకున్న జుట్టును పూర్తిగా విప్పి వదిలే సింది. పసుపురంగు బెంగాల్ హేండ్‌లూమ్ శారీలో స్వచ్ఛంగా వున్న తల్లిని కొద్దిక్షణాలు చూస్తూ వుండిపో యాడు పృధ్వీ.

''ఏమిట్రా అలా చూస్తున్నావ్?'' మందహాసం చేస్తూ అడిగింది.

''నా చిన్నప్పుడు ఎలా వున్నావో ఇప్పుడూ నువ్వు అలాగే వున్నావమ్మా. ఏమీ మారలేదు''

చిన్నగా నవ్వేసింది వైష్ణవి.

పల్చగా కురుస్తున్న వెన్నెల, చిన్న చిరుగాలి, మంచి వేసవిరోజులు కావడంవలన ఆ గాలి కొండంత హాయిని కలిగిస్తోంది. ఆ గాలి ప్రశాంతమైన ఆ వాతావరణం పృధ్వీకెందుకో ఆ క్షణాలు చాలా నచ్చాయి. మౌనంగా ఎంజాయ్ చేయసాగాడు. వైష్ణవి కూడా మౌనంగానే వుండిపోయింది. కొన్ని సమయాల్లో మాట లకన్నా మౌనం చాలా బావుం టుంది.




''లావణ్య ఎంతో శ్రద్ధగా ఆ మొక్కల్ని పెంచుకున్నదిరా. తను ఒక్కవారం రోజులు లేక పోయేసరికి అప్పుడే వాటిని ఎండిపోయేలా చేశావు. నువ్వు కాసిని నీళ్లు పోస్తే అవి అలా వాడిపో యేవి కావుకదా!'' పూల తొట్టెలవైపు చూస్తూ అంది వైష్ణవి.

అతను కూడా తలతిప్పి వాటివైపు చూశాడు. అతడికి యధాలాపంగా అన్న తల్లి మాటల్లో మరో అర్థం కూడా దొరికింది.

నిజమే! లావణ్య తమ మధ్యనున్న అనుబంధాన్ని నమ్మకం అనే నీళ్లు పోస్తూ ఎంతో జాగ్రత్తగా కాపాడుకు నేది. ఆమె ఒక్క వారంరోజులు లేకపోయేసరికి తనేం చేయబోయాడు? ఆ అనుబంధం వాడిపోయేందుకు కారణం అవగలిగిన పని చేయబోయాడు. ఆమె తనపై వుంచిన నమ్మకాన్ని తను కూడా నిలబెట్టుకుంటే అప్పుడు ఆ అనుబంధం ఎప్పటికీ వాడదు.

పృధ్వీలోని అంతర్గతంగా ఉన్న సంస్కారంలో చిన్న కదలిక మొదలైంది.

''ఇక్కడ వంటరిగా కూర్చుని ఏం ఆలోచిస్తున్నా వమ్మా?''

''వేరే ఏం ఆలోచిస్తాను? నాన్న గురించి... తనక్కూడా ఇలాంటి వాతావరణం, ఇలాంటి సమయం చాలా ఇష్టం''

అదీ ఆడదంటే. ఎదురుగా తన ప్రొఫెషన్, పని, పిల్లలు ఎందరున్నా కొన్ని అపురూప క్షణాల్లో భర్తను మాత్రమే గుర్తు చేసుకుంటుంది.

అదే మగవాడైతే? భార్య కాస్తంత పక్కకి వెళితే చాలు వేరే చెప్పనక్కర్లేదు. ఎలా నీచంగా ఆలోచిస్తాడనడానికి తనే ఒక ఉదాహరణ.

గభాల్న పృధ్వీ లోపలికి వెళ్లి సెల్‌ఫోన్ తెచ్చి తండ్రికి డయల్ చేశాడు.

''హలో'' మృదువుగా విన్పించింది తండ్రి గొంతు.

''నాన్నా! నేను పృధ్వీని''

''ఏం నాన్నా! ఏం చేస్తున్నావు? ఇంత రాత్రప్పుడు ఫోన్ చేశావేం?''

''ఏం లేదు నాన్నా. ఇక్కడ ఈ సమయంలో వెదర్ చాలా బాగుంది. నేనూ అమ్మా కూర్చుని మాట్లాడుకుం టున్నాం. మీరు కూడా వుంటే బాగుండునని పించింది'' తల్లి వడిలో తల పెట్టుకుని పడు కుని ఆపే క్షగా చెప్పాడు. చిన్నగా నవ్వు వినిపించింది.

''ఐ లవ్ యూ నాన్నా'' ప్రేమగా తండ్రి గొంతు.


''ఐ టూ డాడీ. బై. గుడ్‌నైట్'' ఫోన్ ఆఫ్ చేశాడు.


చిన్నగా నవ్వుకుంటూ కొడుకు జుట్టు సవరించింది వైష్టవి.

''ఏమైనా మంచి కబుర్లు చెప్పమ్మా. పోనీ ఇది చెప్పు. మీ ఇద్దరిదీ లవ్ మ్యారేజీ కదా. నేనెన్నాళ్ల తర్వాత పుట్టాను?'' ఆసక్తిగా అడిగాడు.

''మూడేళ్లకి. మొదటిసారి నిన్ను చూస్తున్నప్పుడు మీ నాన్న కళ్లల్లో సంభ్రమాన్ని నేనెప్పటికీ మరచిపోను. హి ఈజ్ సో ఎక్సయిటెడ్. మీ మామయ్యకి చెప్పి ఆ ఎక్స్‌ప్రెషన్ అలాగే ఫోటో తీయమన్నాను. ఇప్పటికీ నా దగ్గరుంది ఆ ఫోటో''

''రియల్లీ?''




''ఎస్! తర్వాత మల్లిక పుట్టింది. మీ ఇద్దరినీ రెండు అరచేతుల్లో పెట్టుకుని పెంచారు మీ నాన్న''

''అల్లరి ఎక్కువగా ఎవరు చేసేవాళ్లం మమ్మీ. నేనా మల్లికా?''

''మల్లిక కొద్దిగా నెమ్మదస్తురాలే. నువ్వే చాలా అల్లరి చేసేవాడివి. నాకెంతో కోపం వచ్చేది ఒక్కోసారి. కానీ పొరపాటున కూడా ఒక్క దెబ్బ వేయనిచ్చేవారుకాదు. ఒకసారి మల్లిక ఉయ్యాల్లో నిద్ర పోతుంటే దాని నోటినిండా లడ్డు పెట్టి వచ్చేశావు. పాపం అది నోట్లో లడ్డు అలా ఉంచుకునే నిద్రపోయింది''

ఫక్కున నవ్వాడు పృధ్వీ. ''అది ఇప్పటికీ అంతే కదమ్మా''

''ఆ మాట దాని దగ్గర అను తంతుంది పట్టుకుని''

రాత్రి మరికాస్త గడవడంతో గాలి కూడా ఇంకాస్త చల్లబడింది. గాలికి కదులుతున్న వేపచెట్టు ఆకుల శబ్దం ఆ ప్రశాంతమైన వాతావరణంలో మృదువుగా విన్పిస్తోంది. కాసేపు ఇద్దరూ మౌనంగా వుండిపోయారు ఆ ప్రశాంతతని ఆస్వాదిస్తూ.

పృధ్వీ లేచి లోపలికి వెళ్లి పావుగంటలో రెండు కాఫీ కప్పులతో తిరిగి వచ్చాడు. ఒక కప్పు తల్లికి అందించాడు.

''అర్ధరాత్రి నిద్ర రాకపోతే కాఫీ తాగే అలవాటు మీ నాన్నదే వచ్చిందిరా నీకు''

''రియల్లీ ఐ లవిట్ మమ్మీ. ఐ ఎంజాయ్ ఇట్.''

''లావణ్యని సతాయిస్తున్నావా అర్ధ రాత్రి కాఫీ పెట్టమని''

''ఏం కాదులే. నీ కోడలికి కూడా నేనే కాఫీ పెట్టిస్తాను.''

'లావణ్య చాలా మంచి అమ్మాయిరా''

తల్లి భార్యను పొగుడుతుంటే గర్వంగా అనిపించింది పృధ్వీకి.

హాల్లో గడియారం చిన్నగా మ్యూజిక్ ఇచ్చి నాలుగు గంటలు కొట్టింది.

''మైగాడ్ నాలుగైపోయింది మమ్మీ. తెలియనేలేదు'' రిస్ట్‌వాచ్ చూసుకున్నాడు పృధ్వీ.

చూస్తూ వుండగానే చీకటిలో నెమ్మదిగా వెలుగు రేఖలు పరుచుకోవడం ప్రారంభించాయి.

పృధ్వీ అద్భుతంగా చూడసాగాడు చిరుచీకటి, చిరు వెలుగుల ఆ కలయికని. నిజంగా ఎంత అందమైన దృశ్యం అది.

''ఈ అనుభవం చాలా బాగుంది కదూ మమ్మీ. రాత్రి నిష్క్రమణని ఉదయాగమనాన్ని ఇంత ప్రత్యక్షంగా చూడడం, చూస్తూ వుండగానే చీకటి క్రమంగా చిన్న వెలుతురుగా మారడం, ఈ అందమైన సమయంలో నీతో ఉండడం వాటి ఫెంటాస్టిక్ ఎక్స్‌పీరియన్స్''

చిన్నగా నవ్వింది వైష్ణవి.

''నచ్చేవాళ్లకి నిజానికి రాత్రి సమయం చాలా బావుంటుంది. ఒంటరిగా కూర్చుని ఆలోచించుకోవాలన్నా, ప్రశాంతతని కోరుకున్నా, నిశ్శబ్దాన్ని ఇష్టపడినా రాత్రే బావుంటుంది. పుచ్చపువ్వులా కురిసే వెన్నెల, నిశ్శబ్దం, చిరుగాలి, ఆ గాలికి తోడుగా తేలి వచ్చే పారిజాతం పూల వాసన, ఇవన్నీ ఎంత బాగుంటాయో ఒకసారి అనుభవిస్తే గానీ తెలియదు. వీటన్నిటికీ తోడుగా నిద్ర పట్టక వాక్మెన్‌లో తలత్ మహమూద్ కాసెట్ పెట్టుకున్నావనుకో... నిద్ర పట్టకపోతే దాన్నో పెద్ద జబ్బుగా భావించి డాక్టర్ల చుట్టూ తిరిగేవారు అలా తిరిగే బదులు ఒక్కసారి బయటకి వచ్చిచ కూర్చుంటే మనస్సు, శరీరం కూడా ఎంతో రిలాక్స్ అవుతాయి''

అవునన్నట్లుగా తల ఊపాడు పృధ్వీ.వాచ్ చూసుకుంది వైష్ణవి.

''ఐదయింది నాన్నా. పెళ్లి ఆరున్నరకి. నేను తయారై బయలుదేరుతాను. అక్కడ్నుంచి నా పని చూసుకుని అట్నుంచి అటే ట్రైన్‌లో వెళ్లిపోతాను''

''లగేజ్ మాటేమిటి?''

''నా లగేజంతా ఒక్క బాగే. అది నాతోనే వుంటుంది. ఏమైనా వుంటే ఫోన్ చేయి. నేను బెంగుళూరు వెళ్లాక లావణ్యతో మాట్లాడతాను''

''ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకో నాన్నా. వేళకి సరిగా తింటూ వుండు''

''థాంక్ యూ మమ్మీ. సడెన్‌గా నువ్వు రావడం బాగుంది.''

''ఎన్నిసార్లు చెప్తావురా?'' నవ్వి లోపలికి వెళ్లింది. అరగంటలో తయారై బయలుదేరి వెళ్లిపోయింది వైష్ణవి. తల్లి వెళ్లిన తరువాత అలాగే సోఫాలో కూర్చుండిపోయాడు పృధ్వీ.

చిన్నప్పుడు నడుస్తూ పడిపోబోతే అలవోకగా చిటికెన వేలు అందించి పడిపోకుండా చూస్తూ నడిపించిన తల్లి గుర్తుకు వచ్చింది.

ఇన్నేళ్ల తర్వాత తను మరో తప్పటడుగు వేయబోతుంటే సమయానికి వచ్చి తప్పించి వెళ్లిపోయింది.

ఒక వేశ్యతో రాత్రి తప్పిపోయిన అనుభవం గురించి బాధపడ్డాడు తను. కానీ అమ్మతో కలిసి కూర్చుని అంత చక్కగా గడిపిన ఈ మధురమైన అనుభవం ముందు అది కూడా ఒక అనుభవమేనా? దీనిలో వున్న తృప్తి, ఆనందం, ఇంకెక్కడైనా దొరుకుతుందా? నెవ్వర్!

''థాంక్యూ మమ్మీ! థాంక్స్ వన్సెగెన్''

పృధ్వీ ఉల్లాసంగా లేచాడు ఆ రోజుని ప్రారంభించడానికి. ★

## యమ క్రేజ్!



యమగోల, యముడికి మొగుడు, యమలీల...ఇలా యముడు ప్రధాన పాత్రధారిగా వచ్చిన చిత్రాలు హిట్టయిన సంగతి అందరికీ తెలుసు. మళ్లీ కొంత గాప్ తర్వాత ఇప్పుడు రెండు 'యమ' చిత్రాలు వస్తున్నాయి. మోహన్ బాబు-రాజేంద్రప్రసాద్‌లతో 'యమజాతకుడు' అనే సినిమా వస్తుంటే, సురేష్ హీరోగా 'హలో యమ' అనే సినిమా నిర్మాణంలో వుంది. యమజాతకుడులో యముడిగా చలపతిరావు నటిస్తున్నాడు. ఇక హలో యమాలో యముడిగా కోట శ్రీనివాసరావు నటిస్తున్నాడు. ఈ రెండు 'యమ' చిత్రాలలో ఏది ప్రేక్షకుల్ని ఎక్కువగా ఆకట్టుకుంటుందో వేచి చూద్దాం.

-జె.ఎం.